



వైసీపీ దొంగలు దొరికిపోయారు

వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి ఆ నేరాన్ని టీడీపీపైకి నెట్టేద్దామనుకున్న వైసీపీ నేతల కుట్రను పోలీసులు తిప్పి కొట్టారు.అంబేడ్కర్‌ను అడ్డుపెట్టుకుని రాజకీయ మంటల్లో చలికాచుకుందామనుకున్న నారాయణస్వామి సలహా విన్న ఈ ఘటన ముఖ్య పాత్రదారి సర్పంచ్ గోవిందయ్యను జైలుకు పంపించారు.ఎస్సీల దేవుడు అంబేడ్కర్ విగ్రహానికి అపకారం చేద్దామనుకున్న గోవిందయ్యను కఠినంగా శిక్షించాలి.బేసిక్ నాలెడ్జ్ కూడా లేని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఈ విషయంపై మాట్లాడుతున్న మాటలు జోకర్‌ను తలపిస్తున్నాయి.రూ.3,500 కోట్లు లిక్కర్‌స్కామ్‌లో నిందితుడైన నారాయణస్వామికి ధైర్యముంటే మాపై అటాక్ చేయాలి.అంబేడ్కర్ ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు లేఖ రాసిన వైసీపీ ఎంపీకి నిజాయితీ ఉంటే ఈ ఘటన వెనకున్నవారిని కూడా శిక్షించాలని కోరాలి.

- మీడియా సమావేశంలో టీడీపీ ఎమ్మెల్యేలు వీఎం థామస్, జగన్మోహన్, మురళీమోహన్, నెలవల విజయశ్రీ, యార్లగడ్డ వెంకట్రావు

వాట్ ఆర్ యూ టాకింగ్ ఎస్పీ?



దేవళంపేట ఘటనపై ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడిన తీరు ఏ మాత్రం సరికాదు.దళిత సమాజాన్ని అవమాన పరిచేలా మాట్లాడిన ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలి.అరెస్టు చేసిన గోవిందయ్యను విడుదల చేయాలి. స్థానికంగా ఉన్న టీడీపీ నాయకుడు సతీష్ నాయుడు,సర్పంచ్ గోవిందయ్య మధ్య అంబేడ్కర్ విగ్రహంపై వివాదం వుంటే ఈ కేసులో గోవిందయ్యను ఇరికించారు. ఇది స్వల్ప ఘటన అని ఎస్పీ ఎలా అంటారు? వాట్‌నాన్సెన్స్ ఆర్‌యూ టాకింగ్ ఎస్పీ?ఇదిలాగే కొనసాగితే ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులనూ డిజిటల్ బుక్‌లో ఎక్కిస్తాం.రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ లేదు. పచ్చచొక్కాలు వేసుకుని పనిచేస్తున్నారు.

- మీడియా సమావేశంలో వైసీపీ నేతలు నారాయణ స్వామి, సుధాకర బాబు

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి

స్వగ్రామంలో సీఎం

- కుటుంబ సభ్యులతో కలిసి సోదరుడి సంవత్సరీకానికి హాజరైన చంద్రబాబు



సంవత్సరీక పూజా కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, ఇందిర, నారా లోకేశ్, గిరీష్, రోహిత్

చంద్రగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సోదరుడి సంవత్సరీకానికి హాజరైన సీఎం చంద్రబాబు మూడు గంటలపాటు స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లెలో గడిపారు. కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీనికోసం ఆయన ఉండవల్లిలోని నివాసం నుంచి హెలిప్యాడ్‌లో బయలుదేరి మంగళవారం ఉదయం 11.20 గంటలకు ఎ.రంగంపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన 11.30 గంటలకు నారావారిపల్లెలోని ఇంటికి వచ్చారు. ఇంట్లో నారా రామ్మూర్తి నాయుడికి విస్తర (11వనెల బట్టలు పెట్టడం) కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 12.25 గంటలకు సీఎం చంద్రబాబు, సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి నారా లోకేశ్, రామ్మూర్తి నాయుడి సతీమణి ఇందిర, కుమారులు నారా గిరీష్, నారా రోహిత్, సీఎం సోదరి హైమావతి, ఇతర కుటుంబ సభ్యులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ ఛైర్మన్ రవినాయుడు రామ్మూర్తి నాయుడి ఘాట్‌కు చేరుకుని నివాళులర్పించారు. అక్కడ్నుంచి 12.55 గంటలకు ఇంటికి బయలుదేరారు. సీఎం ఇంటి ముందున్న వందలాది మంది ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు. దాదాపు అరగంట పాటు ప్రజలతో ఉన్నారు. అనంతరం ఇంటిలోపలకు వెళ్లిన ఆయన మధ్యాహ్నం 2.10 గంటలకు హెలిప్యాడ్‌కు బయలుదేరారు. ఆ సమయంలోనూ ఇంటి ముందున్న బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఎ.రంగంపేట నుంచి హెలికాప్టర్‌లో సీఎం, మంత్రి లోకేశ్ ఉండవల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సీఎం సతీమణి నారా భువనేశ్వరి రోడ్డు మార్గంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాదు వెళ్లారు.





రామ్మూర్తి ఘాట్ (సమాధి) వద్ద హారతి ఇస్తున్న నారా లోకేశ్, గిరీష్, రోహిత్

ఎట్టకేలకు రేషన్ డిపోలకు చేరిన బియ్యం

- ఇన్నాళ్లూ సాంకేతిక కారణాలతో ఎంఎల్ పాయింట్లవద్ద లారీల తిష్ట

చిత్తూరు కలెక్టరేట్/పుంగనూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డిపోలకు సకాలంలో ఉచిత బియ్యం సరఫరా చేయడంలో పౌరసరఫరాల సంస్థ అధికారులు విఫలమయ్యారు. జిల్లాలో మొత్తం 1379 రేషన్ డిపోలుండగా వీటికి 14 మండల స్థాయి స్టాకు పాయింట్ల ద్వారా బియ్యం సరఫరా అవుతోంది. చాలా డిపోలకు నాలుగైదు రోజులుగా సరుకులు పంపిణీ కాకపోవడంతో బియ్యం సరఫరాలో ఇబ్బందులు ఎదురయ్యాయి. సాంకేతిక కారణాలు సరిదిద్దడంతో ఎట్టకేలకు మంగళవారం చివరి 16 డిపోలకు బియ్యం తరలించారు. జిల్లాలో 5.40 లక్షల మంది కార్డుదారులన్నారు. వీరికి బియ్యం సరఫరా చేయడానికి 14 పౌర సరఫరాల గోదాములున్నాయి. ఉదాహరణకు అక్టోబరు నెలకు సంబంధించి సెప్టెంబరు 20 లోగా గోదాములకు, 25 తేది నాటికి అన్ని డిపోలకు పూర్తి స్థాయిలో బియ్యం పంపిణీ చేయాలి. ఇలా పౌర సరఫరాల సంస్థ జాబ్ చార్ట్ రూపొందించింది. జిల్లాలో ఉన్న 14 ఎంఎల్ పాయింట్లకు తిరుపతి జిల్లాలోని ఏర్పేడు బఫర్ గోదాము నుంచి లారీల ద్వారా సరఫరా చేస్తారు. ఇక్కడి నుంచి డిపోలకు చేరవేస్తారు. ముందు నెల 25 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. అయితే అమరావతిలోని సంస్థ మెయిన్ సర్వర్‌లో నెలకొన్న సాంకేతిక కారణాలతో ఈ నెల ఐదో తేది దాటినా అధికారులు బియ్యం సరఫరా చేయలేక పోయారు. సాధారణంగా ప్రతి నెలా మొదటి నాలుగైదు రోజుల్లోనే ఎక్కువమంది డీలర్లు డిపోలకు వచ్చి బియ్యం తీసుకువెళుతుంటారు. ఈ నెల నాలుగు, ఐదు తేదీల్లో సగం సరుకు మాత్రమే సరఫరా కావడంతో లబ్ధిదారులు వెనుదిరిగి వెళ్ళారు. పౌర సరఫరాల సంస్థ ప్రధాన కార్యాలయం అమరావతిలో డేటా మైగ్రేట్‌లో సాంకేతిక సమస్యలు గత నెల 25 తేది నుంచి నెలకొనడంతో ఉచిత బియ్యం పంపిణీలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎంఎల్ పాయింట్ల వద్ద రోజుల తరబడి సాంకేతిక కారణాల వల్ల లారీల నుంచి బియ్యం అప్‌లోడ్ కాకుండా ఆగిపోయాయి. జిల్లాకు 8,500 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే సరఫరా జరిగింది. ఈ విషయమై పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ లక్ష్మి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వృద్ధులు ఇబ్బంది పడకుండా వుండేందుకు గతనెల 25వ తేది నుంచి రేషన్ డిపోలకు సగం సరుకులు పంపించి ఆదుకున్నామని, సాంకేతిక సమ్యలు ఎట్టకేలకు మంగళవారం పరిష్కారం కావడంతో 16 డిపోలకు బియ్యం తరలింపు పూర్తి చేశామని, ఇక బియ్యం సమస్య తీరినట్లేనని చెప్పారు.

రబీ పంట రుణాల లక్ష్యం రూ.3479కోట్లు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):రబీ పంటల సాగుకు రూ. 3479 కోట్లను రుణంగా జిల్లా రైతాంగానికి అందించాలని ఉన్నతాధికారులు లక్ష్యాలను నిర్దేశించారు. జిల్లావ్యాప్తంగా 26 బ్యాంకులు 263 శాఖల ద్వారా అన్నదాతలకు సేవలందిస్తున్నాయి. ఈ నెల 1 నుంచి రబీ సీజన్ ప్రారంభంకాగా సుమారు 3.20 లక్షల మంది రైతులకు టర్మ్ రుణాల రూపేణా వ్యవసాయ అనుబంధ రంగాలకు అదనంగా మరో రూ. 16.63కోట్లు బ్యాంకర్లు రబీ సీజన్‌లో రుణాలుగా ఇవ్వనున్నారు. జిల్లాలో అధిక భాగం చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. ఈ నేపథ్యంలో పైరు పెట్టుబడి కోసం అవసరమైన పరపతిని అందివ్వాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులు మార్గదర్శకాలను జారీ చేశారు. కౌలుదారులకు కూడా రుణాలను ఇవ్వాలని ఆదేశించారు. రైతులకు కావాల్సిన రుణాలను బ్యాంకర్లు మంజూరు చేస్తారని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

రెవెన్యూ రికార్డుల తారుమారు యత్నం

- పలమనేరు నియోజకవర్గ తహసీల్దార్లపై కలెక్టర్ ఆగ్రహం

చిత్తూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పలమనేరు నియోజకవర్గంలోని కొందరు తహసీల్దార్ల మీద కలెక్టర్ సుమిత్‌కుమార్ తీవ్రస్థాయిలో ఆగ్రహించినట్లు తెలిసింది. ఈ నియోజకవర్గంలో తహసీల్దార్లు ప్రభుత్వ భూముల రికార్డుల్ని పట్టా భూములుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని కలెక్టర్ గుర్తించారు. దీంతో మంగళవారం నియోజకవర్గంలోని తహసీల్దార్లతో పాటు ఆర్డీవోపై కూడా ఆగ్రహించినట్లు తెలుస్తోంది.గంగవరం మండలంలో అత్యంత విలువైన 6 సెంట్ల స్థలం రెవెన్యూ రికార్డుల్లో చెరువు పోరంబోకుగా ఉంది. ఇక్కడ గతంలో పనిచేసిన ఓ తహసీల్దార్ ఆ రికార్డును మార్చేసి పట్టా చేసేందుకు కలెక్టరేట్‌కు ప్రపోజల్ పంపించారు. ఈ విషయాన్ని గుర్తించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రాథమిక విచారణ చేసి ఆ తహసీల్దార్‌ను వెంటనే బదిలీ చేశారు. అతని మీద పూర్తి స్థాయి విచారణ ప్రారంభించనున్నారు. దీంతో పాటు వి.కోటలో కూడా రూ.కోట్ల విలువ చేసే 97 సెంట్ల స్థలాన్ని ఒకరు ఆక్రమించుకుని, రెవెన్యూ రికార్డుల్లో కూడా పేరు నమోదు చేయించుకున్నారు. దీన్ని కూడా కలెక్టర్ గుర్తించి, దాన్ని రద్దు చేయడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే మంగళవారం జరిగిన ఓ సమావేశంలో కలెక్టర్ ఆగ్రహించి, తహసీల్దార్ల పేర్లు చెప్పకుండా అందర్నీ ఉద్దేశించి కోప్పడినట్లు తెలుస్తోంది.ఆర్డీవో పర్యవేక్షణలేమితోనే ఇలాంటివి జరుగుతున్నాయని, ఇవి పునరావృతమైతే కఠిన చర్యలు తప్పని హెచ్చరించినట్లు సమాచారం.

నేటి నుంచి మూడో విడత రీసర్వే

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు భూ రీసర్వే కార్యక్రమం మూడో విడత ఎంపిక చేసిన 12 గ్రామాల్లోని 3859 ఎకరాల్లో పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలతో రీసర్వేపై సమీక్షించారు. జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడేల్, డీఆర్వో మోహన్ కుమార్, సర్వేశాఖ డీడీ జయరాజ్, ఇన్‌చార్జి ఏడీ శాంతి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ సహకార సదస్సు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తాజ్ హోటల్ వేదికగా బుధవారం నుంచి రెండు రోజుల పాటు కేంద్ర సహకార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సదస్సు జరగనుంది. సహకార రంగ బలోపేతంతో ఆర్థిక వృద్ధిని పెంపొందించడం లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. కేంద్ర సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశీష్‌కుమార్ భుటానియాతో పాటు వివిధ రాష్ట్రాల సహకార శాఖ ఉన్నతాకారులు, ప్రతినిధులు హాజరవుతున్నారు. ఇప్పటికే సుమారు 70మంది ప్రతినిధులు నగరానికి చేరుకున్నారు. సదస్సు సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న సంస్కరణలు, సహకార రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఏపీ జాయింట్ సెక్రటరీ సిద్దార్థ జైన్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్‌ల పర్యవేక్షణలో జరిగే సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.



జాతీయ సహకార సదస్సుకు సిద్ధమైన తాజ్ హోటల్‌లో వేదిక

వెన్నెల్లో విహరించిన వైకుంఠనాథుడు



తిరు మాడవీధుల్లో పౌర్ణమి వెలుగుల్లో శ్రీవారు మంగళవారం తన ప్రియవాహనం గరుడుడిపై విహరించారు. ప్రతినెలా పౌర్ణమిరోజున నిర్వహించే గరుడ సేవలో భాగంగా.. మంగళవారం రాత్రి మలయప్పస్వామిని విశేష అభరణాలు, పుష్పాలతో అలంకరించారు. తర్వాత గరుడ వాహనంపై కొలువుదీర్చి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మాడవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు వాహనసేవ కదులుతున్న క్రమంలో అతి దగ్గరగా ఓ శునకాన్ని గుర్తించిన అధికారులు, సిబ్బంది కంగారుపడ్డారు. వెంటనే దూరంగా తరిమారు. సిబ్బంది నిర్లక్ష్యంపై అధికారులు ఆగ్రహించినట్టు సమాచారం.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గ్యాంగ్ రేప్ నిందితులను కఠినంగా శిక్షించాలి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్యాంగ్‌రేప్ కేసులో ముగ్గురు నిందితులను కఠినంగా శిక్షించాలని చిత్తూరు స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు తాండవ మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు వందలాది మంది విద్యార్థులతో కలిసి నగరంలో ర్యాలీ చేశారు. గాంధీ సర్కిల్ వద్ద మానవహారాన్ని నిర్వహించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుల తరపున న్యాయవాదులు వాదించకూడదని విజ్ఞప్తి చేశారు. హయగ్రీవ పాఠశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించిన చిత్తూరు స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు





ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, తిరుపతి



అవును.. వీళ్లు బతికే ఉన్నారు!



మానవత్వమే సిగ్గుపడే దృశ్యం ఇది. తిరుపతి రుయా ఆసుపత్రికి ఎదురుగా ఇస్కాన్ రోడ్డులోని బస్టాప్‌లో బతికున్న శవాల్లా పడివున్నారు వీరంతా. ఎవరో తెలీదు. ఎక్కడి నుంచి ఎలా వచ్చారో తెలీదు. ఎప్పుడొచ్చి ఈ నీడకు చేరారో ఏమో.. మూలుగుతూ ముక్కుతూ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ ఉన్నారు. మొన్న ఆరుగురు. నిన్న ఐదుగురు. ఈరోజు రాత్రికి నలుగురు మిగిలారు. వెళ్లిపోయారో, చచ్చిపోయారో తెలీదు. దూసుకుపోయే వాహనాలు.. నడచిపోయే మనుషులు.. ఎవరికీ పట్టని ఈ ప్రాణమున్న శవాలకు మంగళవారం సందెచీకటి వాలేవేళ మందుపూస్తూ, అన్నం పెడుతూ, నీళ్లు తాగిస్తూ అలిపిరి అమ్మగా పేరుపడ్డ సుజాత కనిపించారు. ఈరోజు కన్నుమూసిన వ్యక్తికి పూలమాలవేసి, దణ్ణం పెట్టుకుని ఆమె సాగనంపారు. దివ్యక్షేత్రమైన తిరుమలకు తొలిమెట్టు అయిన అలిపిరిలో ఇది సాధారణ దృశ్యం. పవిత్ర భావనతో శ్రీనివాసుడి దగ్గరకు పయనమయ్యేవారి మనసు వికలమయ్యే చిత్రం. దేవుడిమీద భారం వేసి అలిపిరికి చేరుకుని ఇలా కన్నుమూస్తున్నవారికి జానెడు నీడ, పిడికెడు ముద్ద, రోగానికి మందు ఇచ్చే విశాల హృదయం టీటీడీకి కలిగితే బావుణ్ను!

– ఆంధ్రజ్యోతి, తిరుపతి



సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం :రూ.4.16 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,773

తలనీలాలు సమర్పించినవారు: 29,100

పిరమిడ్ పార్టీకి ఎన్నికల కమిషన్ షోకాజు నోటీసులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా వార్షిక ఆడిట్, ఎన్నికల ఖర్చు వివరాలను రాష్ట్రఎన్నికల సంఘానికి సమర్పించకపోవడం వల్ల భారత ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసిందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. షోకాజ్ నోటీసులు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఈ నెల 14వ తేదీ లోపు వెలగపూడిలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి అన్ని రకాల ఆధారపత్రాలతో సహా రాతపూర్వకంగా వివరణ అందజేయాల్సి ఉంటుందన్నారు.

మాజీ ఆర్డీవోకు రెండ్రోజుల పోలీస్ కస్టడీ

చిత్తూరు లీగల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మాజీ ఆర్డీవో మురళిని సీఐడీ కోర్టు రెండ్రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించారు. మదనపల్లెలో జరిగిన ఫైల్స్ దహనం కేసులో గతనెల 19వ తేదీన మురళిని సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మురళిని పోలీస్ కస్టడీకి అనుతించాలంటూ సీఐడీ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు పూర్తయ్యాక.. మురళిని బుధ, గురువారాల్లో పోలీసుకస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి షేక్ బాబా జాన్ ఆదేశాలు జారీ చేశారు.

'పల్లినేని' కుటుంబానికి లోకేశ్ పరామర్శ



సుబ్రహ్మణ్యం నాయుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి లోకేశ్

పాకాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దివంగత టీడీపీ సీనియర్ నేత, డీసీఎంఎస్ ఛైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడి కుటుంబ సభ్యులను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఉదయం గడ్డంవారిపల్లెకు చేరుకున్నారు. సుబ్రహ్మణ్యం నాయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుబ్రహ్మణ్యం భార్య మునిలక్ష్మి, కుమార్తెలు రేవతి, మేఘన, తల్లిదండ్రులను పరామర్శించారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సుబ్రహ్మణ్యం నాయుడు పార్టీకి చేసిన సేవలను శ్లాఘించారు. ఈ సందర్భంగా అక్కడ గ్రామస్థులను పలకరించారు. వారి నుంచి అర్జీలను స్వీకరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామరిస్తున్న మంత్రి

13 ఎర్రచందనం దుంగల స్వాధీనం

● కారు సీజ్ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్

మంగళం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు-పీలేరు రహదారిలో మంగళవారం ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించి 13 ఎర్రచందనం దుంగలును స్వాధీనం చేసుకుని ఓ కారును సీజ్ చేశారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ డీఎఫ్‌వో రామకొండారెడ్డికి అందిన సమాచారం మేరకు.. మంగళవారం తెల్లవారుజాము నుంచి పూతలపట్టు-పీలేరు రహదారిలో పులిచెర్ల వద్ద అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉదయం 10.30గంటలకు పులిచెర్ల వద్ద ఏపీ 39 ఎల్ జెడ్ 9951 నెంబరు గల కారు వేగంగారావడాన్ని అధికారులు గుర్తించారు. కారును ఆపేందుకు ప్రయత్నించగా.. వేగంగా వెళ్లిపోయింది. దీంతో వాహనాన్ని వెంబడించారు. డ్రైవర్ గుడిపల్లి గ్రామం సమీపంలో కారు ఆపి పారిపోయాడు. అధికారులు కారును పరిశీలించగా 13 ఎర్రచందనం దుంగలున్నాయి. పట్టుబడిన వాహనం, దుంగల విలువ రూ.18.64 లక్షలు ఉంటుందని ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ సుబ్బరాయుడు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్‌వో శశికుమార్, ఎఫ్‌బీవో చంద్రబాబు, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

మూగజీవాలకు 'సూపర్' సేవలు

తిరుపతిరూరల్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): పశు వైద్య రంగం కొత్తపుంతలు తొక్కుతోంది. వివిధ వ్యాధులను గుర్తించడమే కాకుండా ఆధునిక పద్ధతుల్లో చికిత్సనూ అందిస్తున్నారు. ఇలాంటి వినూత్న వైద్య సేవలకు కేంద్రంగా నిలుస్తోంది ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని పశు వైద్య చికిత్స సముదాయ(వీసీసీ)విభాగం. పశువులకు వచ్చే ఎన్నో వ్యాధులకు ఇక్కడ చక్కని పరిష్కారం చూపుతున్నారు.



నేటి నుంచి జాతీయ సదస్సు

వీసీసీ ఆధ్వర్యంలో శాస్త్రీయపరమైన పశువిజ్ఞానాన్ని, అనుభవాలను విద్యార్థులకు అందించేందుకు బుధవారం నుంచి రెండ్రోజులపాటు కళాశాల ఆడిటోరియంలో క్లినికల్ కేస్ వెటర్నరీ స్టూడెంట్స్ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నాం. ఇందులో 14టెక్నికల్ సెషన్స్ ఉంటాయి. వివిధ ఆష్ట్రాల నుంచి యూజీ,పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొంటున్నారు. సదస్సుకు అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థుల క్లినికల్ ఎక్స్‌పోజర్, నైపుణ్యత ప్రదర్శనకు చక్కని సదస్సు వేదికవుతుంది.

– డాక్టర్ వి.వైకుంఠరావు, వీసీసీ హెడ్

అబ్బురపరిచే ఆధునిక వైద్యం

వీసీసీలో అధునాతన పరికరాలతోపాటు ఎక్స్‌రే యూనిట్, ఆపరేషన్ థియేటర్, వ్యాధి నిర్ధారణ పరీక్షల ప్రయోగశాల, పెద్ద, చిన్న జంతువుల ఇన్‌పేషంట్ సౌకర్యం, ఆక్వాలిఫ్ట్ లాంటి సదుపాయాలున్నాయి. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకే కాదు గుర్రాలు, చిరుతలు, సింహాలు, ఏనుగులు, పక్షులకు కూడా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్నారు. పెంపుడు జంతువులకు రక్తపరీక్షలు, ఎక్స్‌రే, శస్త్రచికిత్సలు, ఇతర పరీక్షలకు రుసుము చెల్లించాలి. వీసీసీలో చేస్తున్న కృషికి జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. 2008లో ఈవిభాగం టీచింగ్ వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్‌గా ఏర్పాటై 2019లో వీసీసీగా మార్పు చెందింది. తిరుపతి తాతయ్యగుంటలోని సీటీవెటర్నరీ ఆసుపత్రి, తొండవాడలో వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌లోనూ పశువైద్యసేవలు అందిస్తున్నారు. అంతేకాదు యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల క్లినికల్ శిక్షణకు ఇది ప్రధానకేంద్రంగా నిలిచింది. రాయలసీమజిల్లాలో పశువైద్యానికి సంబంధించి అత్యవసర కేసులకు రిఫెరల్ గానూ కీలకభూమిక పోషిస్తోంది. కేంద్రంలో రోజూవందకు పైగా ఓపీ సేవలందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



వీసీసీ భవనం



సీఎంను కలిసి వినతులు ఇచ్చేందుకు నిరీక్షిస్తున్న ప్రజలు



మానసిక వైకల్యమున్న ఈ పదేళ్ల చిన్నారి పేరు ప్రత్యూష. నాయుడు పేట పట్టణం. తల్లిదండ్రులు లేని ఆమె.. పెద్దనాన్న సంరక్షణలో ఉంది. 90 శాతం వైకల్యమున్నా పూర్తి పెన్షన్ అందడం లేదు. దీనిపై నారావారిపల్లెలో సీఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేయగా.. రూ.15 వేల పింఛను అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

జనం వెతలు వింటూ..

● పరిష్కారానికి హామీలిచ్చిన సీఎం

చంద్రగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు మంగళవారం ఉండింది మూడు గంటలే. ఆయన వచ్చింది సోదరుడి సంవత్సరీకం కార్యక్రమంలో పాల్గొనేందుకు. ఇంత బిజీ షెడ్యూల్‌లోనూ ఆయన తనకోసం వచ్చిన జనం వెతలు ఓపిగ్గా విన్నారు. అరగంటకుపైగా వారితో మాట్లాడారు. వినతులు స్వీకరించారు. అప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలిచ్చారు. కాగా చంద్రబాబుకు ఎ.రంగంపేట హెలిప్యాడ్ వద్ద స్వాగతం.. వీడ్కోలు పలికారెందరో. వీరిలో సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, చంద్రగిరి, తిరుపతి, నగరి, శ్రీకాళహస్తి, జీడీనెల్లూరు, సూళ్లూరుపేట, సత్యవేడు, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, డాక్టర్ థామస్, నెలవల విజయశ్రీ, ఆదిమూలం, మురళీమోహన్, వివిధ కార్పొరేషన్ల ఛైర్‌పర్సన్లు హేమలత, సుగుణమ్మ, నరసింహయాదవ్, డాలర్స్ దివాకర్‌రెడ్డి, రవినాయుడు, సీఆర్ రాజన్, రుద్రకోటి సదాశివం, డీసీసీబీ ఛైర్మన్ అమాస రాజశేఖరరెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, పరసారత్నం, మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. అలాగే, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, జేసీ శుభం బన్సల్, డీఐజీ షిమోషీ వాజ్పేయి, ఎస్పీ సుబ్బరాయుడు, డీపీవో సుశీలాదేవి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో కర్ణాటక ముఠా

● చైన్ స్నాచింగ్, దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇటీవల చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలకు పాల్పడేది కర్ణాటక గ్యాంగ్ అని పోలీసులు గుర్తించారు. వీరు నగరాన్ని షెల్టర్ జోన్‌గా చేసుకుని చైన్ స్నాచింగ్‌ల నుంచి ద్విచక్ర వాహనాలు చోరీ చేయడం, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో మహిళలు, వృద్ధుల బ్యాగులు ఎత్తుకెళ్లి ఆభరణాలు, నగదు కొట్టేస్తున్నారని తెలిసింది. వీరు ఆరు నెలలకు ఒకసారి తాము ఎంచుకున్న ప్రాంతాలకు వెళ్లి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ ముఠాల కోసం జిల్లా పోలీసులు ఆరేడు నెలలుగా గాలిస్తున్నారు. తిరుపతిలో కర్ణాటకకు చెందిన దాదాపు 10 గ్యాంగుల సభ్యులు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెబుతున్నారు. రెండు రోజుల తిరుపతిలో క్రితం తిరుపతిలోని పోస్టల్ కాలనీలో ఒకరు.. అలిపిరి పరిధిలోని నలుగురు మహిళల మెడల నుంచి దాదాపు 186 గ్రాముల బంగారు చైన్లు లాక్కొని పరారయ్యారు. ఈ పనికి పాల్పడింది కర్ణాటక ముఠానే అని తాజాగా భావిస్తున్నారు. మంగళవారం సాయంత్రం తిరుపతి రూరల్ పరిధిలోని చిగురవాడలో ఇద్దరు మహిళల మెడల నుంచి చైన్లు లాక్కెళ్లారు. వీరు స్థానికంగా ద్విచక్ర వాహనాలు దొంగిలించి, ఇలాంటి నేరాలకు పాల్పడుతుండటంతో పోలీసులు తొలుత స్థానికులే ఈ పనికి పాల్పడినట్లు భావించారు. కానీ, విచారణలో కర్ణాటక గ్యాంగు ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందని పోలీసు వర్గాలు తెలిపాయి. మరోవైపు చైన్ స్నాచింగ్ నేపథ్యంలో వాకింగ్ వెళ్లే మహిళలు ఆందోళన చెందుతున్నారు. వాకింగ్ సమయంలో విలువైన ఆభరణాలు వేసుకెళ్లొద్దని పోలీసులూ సూచిస్తున్నారు. ఈ ముఠాపై నిఘా పెట్టామని, త్వరలోనే వారిని పట్టుకుంటామని ఓ పోలీసు అధికారి చెప్పారు.



క్యూలైన్‌లో దర్శనానికి వేచిఉన్న సర్వదర్శన భక్తులు



ఆక్టోపస్ భవనం సర్కిల్ వద్ద సర్వదర్శన అదనపు క్యూలైన్‌కు అడ్డుగా పెట్టిన బారికేడ్

తిరుమలలో అదే రద్దీ

తిరుమల, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. తమిళులు అత్యంత పెరటాశి మాసాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. తమ స్వగ్రామాల నుంచే తిరుమలకు కాలినడకన చేరుకుని స్వామిని దర్శించుకునే సంప్రదాయం ఉంది. సెప్టెంబరు 17వ తేదీన పెరటాశి మాసం ప్రారంభమైనప్పటికీ 25వ తేదీ వరకు భక్తుల రద్దీ మోస్తరుగానే కనిపించింది. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన 24వ తేదీతో పాటు 25 తేదీలు వీఐపీల హడావుడితో కనిపించిన క్షేత్రం.. 26 నుంచి మాత్రం భక్తులతో రద్దీగా మారిపోయింది. 27 పెరటాశి రెండో శనివారంతో పాటు మరుసటి రోజు 28న గరుడవాహనం కావడంతో ఆ మూడురోజులు తిరుమల కిటకిటాలడింది. ఆ రద్దీ ఇప్పటికీ కొనసాగుతోంది. సర్వదర్శన క్యూలైను ఆక్టోపస్ భవనం వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేరకు వ్యాపిస్తోంది. అర్ధరాత్రి దాటాక కూడా భక్తులు క్యూలైన్‌లోకి చేరి ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రమంలో మధ్యాహ్నం 3 గంటల తర్వాత బాటగంగమ్మ ఆలయ సర్కిల్ సమీపంలోని క్యూలైన్‌కు తాళం వేయాల్సి వస్తోంది. ఇక, అదనపు క్యూలైన్ ప్రవేశమైన ఆక్టోపస్ భవనం సర్కిల్ వద్ద బారికేడ్‌ను క్యూలైన్‌కు అడ్డుగా పెడుతున్నారు. తిరిగి అర్ధరాత్రి తర్వాత భక్తులను క్యూలైన్‌లోకి అనుమతిస్తున్నారు.

- 12 రోజుల్లో 8.9 లక్షల మంది స్వామిని దర్శించుకున్నారు.
- అత్యధికంగా 4న 83,380.. 5న 83,412 మంది దర్శించుకున్నారు.
- 11 రోజుల్లో 37.32 కోట్ల హుండీ ఆదాయం లభించింది.
- 3,33,234 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.



క్యూలైన్‌లోకి వెళ్లేందుకు పరుగులు తీస్తున్న భక్తులు



పట్టుబడిన స్మగ్లర్లు, వాహనం, దుంగలతో ఉద్యోగులు

ఎర్రచందనం పట్టివేత

భాకరాపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఇద్దరు స్మగ్లర్లతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజర్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భాకరాపేట-తలకోన మార్గంలో ఎర్రచందనం అక్రమ రవాణా అవుతున్నట్లు సమాచారం అందడంతో పూలకుంటపల్లె రోడ్డు వద్ద నిఘా పెట్టామన్నారు. ఈక్రమంలో ఓ కారును ఆపగా తమిళనాడుకు చెందిన చందురిస్ యజుమలై, తరుమాన్ సామిక్కన్ అనే స్మగ్లర్లు పారిపోయేందుకు ప్రయత్నించారన్నారు. వారిని వెంబడించి పట్టుకుని కారును తనిఖీ చేయగా ఆరు ఎర్రచందనం దుంగలు లభ్యమయ్యాయన్నారు. స్మగ్లర్లపై కేసు నమోదు చేసి వాహనంతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులకు కోర్టు రిమాండ్ విధించిందని ఆయన తెలిపారు. దాడిలో ఎఫ్ఎస్‌వో సలావుద్దీన్, ఎఫ్‌బీవోలు రాజేశ్ కుమార్, ప్రదీప్ చంద్, రవి, సిబ్బంది శంకర్ రోహిత్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నట్లు వివరించారు.

వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకం



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని స్విమ్స్ సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సంస్కృతికి మూలస్తంభంగా నిలిచిందన్నారు. యువత వాల్మీకి జీవితాన్ని మార్గదర్శకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి గురుస్వామిశెట్టి తదితరులు పాల్గొన్నారు.




నారావారిపల్లెలో సీఎం చంద్రబాబును, మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే భానుప్రకాష్

వాల్మీకి రామాయణం మానవ జీవన విధానానికి మార్గదర్శకం

● ఎస్పీ తుషార్ డూడి



వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ తుషార్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి రామాయణం మానవ జీవన విధానానికి మార్గదర్శకం చూపుతుందని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజానికి నీతి, ధర్మం, సత్యం అనే విలువలను బోధించిన మహానుభావుడు వాల్మీకి మహర్షి అని తెలిపారు. ఏఎస్పీలు రాజశేఖర్‌రాజు, శివానంద కిశోర్, డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, డీసీఆర్‌బీ సీఐ చంద్రశేఖర్, మహిళా స్టేషన్ సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలపై ఉన్న తప్పుడు కేసులను తొలగించాలి

● ఎస్పీకి వినతిపత్రం ఇచ్చిన పార్టీ నేతలు



ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2019-24 మధ్య టీడీపీ కార్యకర్తలపై నమోదైన తప్పుడు కేసులను పూర్తి స్థాయిలో విచారించి.. తొలగించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ కోరారు. మంగళవారం టీడీపీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నేతలు వెంకటేశ్‌యాదవ్, ధరణీయాదవ్‌లతో కలిసి ఎస్పీ తుషార్ డూడీకి ఈ మేరకు వినతిపత్రాన్ని ఇచ్చారు. జిల్లాలో చాపకింద నీరులా వ్యాపిస్తున్న గంజాయి, లాటరీ టిక్కెట్ల విక్రయాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. వడ్డీ వ్యాపారులు, మైక్రో, ఆటోఫైనాన్స్ నిర్వాహకుల దందాను అడ్డుకోవాలని కోరారు. ఖాళీగా ఉన్న హోంగార్డు పోస్టులను భర్తీ చేయాలన్నారు. అలాగే డీజిల్, కల్తీ మద్యం మాఫియాపై నిఘా పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

నగరి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా రాజమ్మ

నేడు పదవీ ప్రమాణం



నగరి/విజయపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరి మార్కెట్‌లో యార్డులో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సమక్షంలో ఏఎంసీ చైర్‌పర్సన్‌గా విజయపురం మండలం మహారాజపురానికి చెందిన రాజమ్మ బుధవారం ఉదయం 10 గంటలకు పదవీ ప్రమాణం చేయనున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి జెండా మోసిన డి.సుబ్రహ్మణ్యంరాజు సేవలకు గుర్తింపుగా ఆయన సతీమణి రాజమ్మకు ఏఎంసీ చైర్‌పర్సన్ పదవి దక్కింది. సుబ్రహ్మణ్యం రాజు మండల టీడీపీ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు, ఎంపీటీసీగా, నియోజకవర్గ తెలుగు రైతు విభాగం కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ముద్దుకృష్ణమనాయుడితో సన్నిహితంగా ఉండేవారు. సుబ్రహ్మణ్యం రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, ప్రమాణ స్వీకార మహోత్సవానికి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, టీడీపీ కుటుంబీకులు తరలిరావాలని సుబ్రహ్మణ్యం రాజు, రాజమ్మల తనయుడు లోకేశ్ పిలుపునిచ్చారు. అలాగే వైస్ చైర్మన్‌గా కె.రామ్మూర్తి నాయుడు, 13 మంది డైరెక్టర్లు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రమాణం చేయనున్నారు.

డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా సాబ్జీ సాహెబ్

చిత్తూరు సిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలోని ఉర్దూ పాఠశాలల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్(డీఐ)గా సాబ్జీ సాహెబ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పలమనేరు ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఉన్న ఆయనకు డీఐగా అదనపు బాధ్యతలు ప్రభుత్వం అప్పగించింది. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

నియోజకవర్గ స్థాయిలో జీఎస్టీ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయండి : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ స్థాయిలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో ప్రజలు ఎక్కడా నీటి కోసం ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు.

రేపటినుంచి ప్రభుత్వ వైద్యశాలల్లో జీఎస్టీపై అవగాహన కార్యక్రమాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో, ఏరియా, సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో గురువారం నుంచి జీఎస్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో సుధారాణిని స్టేట్ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీరపాండ్యన్ ఆదేశించారు. మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ ఆఫీసర్లతో డీఎంహెచ్‌వో సమావేశం నిర్వహించి.. ఈ కార్యక్రమం అమలుకు ఆదేశాలిచ్చారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి పీహెచ్‌సీ వైద్యుల నిరసన



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీ వైద్యులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేవరకు పోరాటాన్ని ఆపేదిలేదని పీహెచ్‌సీ వైద్యులు తేల్చిచెప్పారు. డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట మంగళవారం మోకాళ్లపై నిలబడి తమ నిరసనను కొనసాగించారు. పీహెచ్‌సీ వైద్యుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఏడు రోజులుగా ధర్నాలు చేస్తుంటే ప్రభుత్వ పట్టనట్టుగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

ఆగని గజదాడులు

ఆందోళనలో అన్నదాతలు ● వరి, కొబ్బరి, మామిడి, వేరుశనగ పంటలకు తీవ్రనష్టం




మామిడిచెట్టు కొమ్మలను విరిచేసిన ఏనుగులు - ధ్వంసమైన కొబ్బరిచెట్లను చూపిస్తున్న రైతు నారాయణ

కల్లూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు ఆగడంలేదు. రోజూ ఏదో ఒక ప్రాంతంలో రాత్రి వేళలో ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. వరి, కొబ్బరి, టమోటా, అరటి, మామిడి తదితర పంటలకు అపారనష్టం వాటిల్లుతోంది. ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను అటవీశాఖ అధికారులు పరిశీలించి కంటి తుడుపు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంటలపై ఏనుగుల గుంపు దాడులను అరికట్టాలని అధికారులను వేడుకుంటున్నారు. సోమవారం రాత్రి తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్ప చెరువు నుంచి బయలుదేరిన 9 ఏనుగుల గుంపు ముందుగా దేవళంపేట పంచాయతీ మిట్టమీదరాచపల్లి సమీపానికి చేరుకున్నాయి. రైతులు బసవయ్య, భాస్కర్, బాలచంద్ర, నారాయణ, శిద్దయ్యకు చెందిన వరి, వేరుశనగ పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. రైతు నారాయణకు చెందిన కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి. అక్కడి నుంచి దిగుమూర్తివారిపల్లి వద్దకు చేరుకున్న ఏనుగుల గుంపు రైతు గురుస్వామికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను, రాతికూసాలను విరిచేశాయి. దేవళంపేట-కమ్మపల్లి రోడ్డు మార్గంలో గెండేవారిపల్లి వద్దకు చేరుకున్న ఏనుగుల గుంపు మహిళా రైతు హైమావతికి చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి తిరుగుముఖం పట్టిన ఏనుగుల గుంపు అడవిలోకి చేరుకున్నాయి. మంగళవారం పగలంతా అడవిలోని చింతలవంక వద్ద ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

మీ హయాంలో శేషవస్త్రాలు ఎక్కడికి పోయాయి?

●భూమనకు టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ ప్రశ్న

తిరుమల, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): 'వారంరోజుల పాటు స్వామిపై ఉన్న శేషవస్త్రాలు మీ హయాంలో బయటకు ఎలా పోయాయి భూమన కరుణాకరరెడ్డి గారూ?' అని టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మంగళవారం తిరుమల ఆలయం ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2019 నుంచి 2024 వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చిన కారణంగా కొన్ని శేషవస్త్రాలు ఎవరికి చేరకూడదో వారికి చేరాయని భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. అవి ఎంతమందికి చేరాయో ఆ లెక్కలు కూడా త్వరలో బయటపడతాయంటూ.. దీనిపై కూడా విచారణ చేయిస్తామని భానుప్రకాష్ అన్నారు. అర్చకులు, శేషాద్రిస్వామి వంటి వారు మృతి చెందిన తర్వాత దహన క్రియలు జరిగిన అనంతరం సంప్రదాయానుసారం అక్కడికి వెళ్లి పరివట్టం కట్టే పద్ధతి ఉందని తెలిపారు. ధర్మారెడ్డి కుమారుడు చనిపోయినప్పుడు కూడా ఇలాగే జరిగిందని, అక్కడ భూమన కరుణాకరరెడ్డి కూడా ఉన్నారని చెప్పారు. శ్రీవారి ప్రతిష్ఠ, తిరుమల పవిత్రత దిగజార్చేలా మాట్లాడడం మానుకోవాలని భూమనకు హితవు చెప్పారు.

రాజకీయాల కోసం కులాల మధ్య చిచ్చుపెడతావా?

●మాజీ మంత్రి నారాయణస్వామిపై ఎమ్మెల్యే థామస్ ఫైర్

● తాను అవినీతికి పాల్పడినట్లు ఒక్క ఆధారమైనా చూపించాలని సవాల్



కార్వేటినగరంలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంచిపెడుతున్న ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):తాను అవినీతి, అక్రమాలకు పాల్పడ్డట్టు ఒక్క ఆధారాన్ని అయినా సరే చూపించాలంటూ మాజీ మంత్రి నారాయణస్వామికి జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ సవాల్ విసిరారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన రోజులంతా రబ్బర్‌స్టాంప్‌గా ఉన్నావు తప్ప ఒక ప్రజా ప్రతినిధిగా పని చేయలేదన్నారు. మంగళవారం కార్వేటినగరం మండలంలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు. దేవళంపేటలో పూరిగుడిసె కాలిపోతోందని ఓ మహిళ చెబితే అక్కడికి వచ్చిన సర్పంచ్ గోవిందయ్య ఆ మంటలను అంబేడ్కర్‌కు పెట్టాడని ఆరోపించారు. దళితుడై ఉండి దళితులంతా ఆరాధ్యదైవంగా కొలిచే అంబేడ్కర్ విగ్రహానికి నిప్పంటించారంటే వారంతా దళితులేనా అని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉండి రాజకీయ ప్రయోజనం పొందాలని చూసిన నారాయణస్వామిని జైలుకు పంపుతామని హెచ్చరించారు. రాజకీయాల కోసం కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్న నారాయణస్వామిని ప్రజలు నమ్మే ప్రసక్తే లేదన్నారు.గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి సుమారు రూ.వెయ్యి కోట్లతో కంపెనీలను తీసుకొస్తుంటే.. ఇక్కడ పరిశ్రమలు పెట్టొద్దంటూ నారాయణస్వామి వారిని బెదిరిస్తున్నాడని చెప్పారు. రూ. 150 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తున్నానని, వాటిని ఓర్వలేకనే నారాయణస్వామి మతిభ్రమించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. నియోజకవర్గంలో మట్టి, క్వారీలను లాక్కుంటున్నానని తనపై దుష్ప్రచారం చేస్తున్నాడని, ఆయన లాగా అక్రమ మద్యం కేసులో అడ్డంగా దొరికిన దొంగను తాను కాదన్నారు. రోజుకో ఊరంటూ చెప్పుకుని తిరిగే నారాయణ స్వామి లాంటి నీచున్ని తానెప్పుడూ చూడలేదన్నారు.తనపై తప్పుడు కూతలు కూస్తే నియోజవర్గంలో అడుగుపెట్టలేవని హెచ్చరించారు.ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన గుణపాఠం చెప్తానని హెచ్చరించారు.

కుప్పంలో వాల్మీకి భవనం పూర్తికి నిధులు : కలెక్టర్



వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మేయర్ అముద, కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న వాల్మీకి భవన నిర్మాణాన్ని పూర్తి చేయడానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. వాల్మీకి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో మంగళవారం మేయర్ అముదతో కలిసి మహర్షి చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాగరికత పూర్తిగా అభివృద్ధి చెందని నాటి రోజుల్లో సమాజ అభివృద్ధికి వాల్మీకి మహర్షి రచనలు ప్రముఖ పాత్ర పోషించాయని చెప్పారు. ఉపాధి, నాబార్డు నిధులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల చెందిన కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, అభ్యున్నతికి చర్యలు చేపడతామన్నారు.

గుండ్లపల్లెలో ఎర్రచందనం దుంగల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎర్ర చందనం దుంగలు, కారు

ఐరాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలోని గుండ్లపల్లెలో ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్ఆర్వో సుబ్బారాయుడు తెలిపిన వివరాల మేరకు.. పులిచెర్ల మార్గంలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం రాత్రి తిరుపతికి చెందిన అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ మాటు వేసింది. రాత్రి ఓ కారు అనుమానాస్పదంగా రావడంతో ఆపారు. అయితే కారును డ్రైవర్ నిలపకుండా వేగంగా వెళ్లిపోయాడు. అధికారులు వాహనాన్ని వెంబడించారు. రాత్రి కావడంతో ఆ వాహనం తప్పించుకెళ్లింది. మంగళవారం ఉదయం ఐరాల మండలంలోని గుండ్లపల్లె వద్ద ఓ మామిడి తోటలో కారుతోపాటు 13 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు అటవీశాఖ అధికారులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. దాంతో వారు మామిడితోట వద్దకెళ్లి కారును, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

గరుడ వాహనసేవలో కంగారుపెట్టించిన శునకం



వాహనసేవ నుంచి శునకాన్ని దూరంగా తరుముతున్న సిబ్బంది

తిరుమల, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం రాత్రి జరిగిన గరుడవాహనసేవలో ఓ శునకం అధికారులు, సిబ్బందిని కంగారు పెట్టించింది. సాధారణంగా తిరుమలలో శునకాల సంచారం నిషేధం. ఒక వేళం శునకాలు కనిపించినా వాటిని ఎప్పటికప్పుడు హెల్త్ విభాగం పట్టుకుని తిరుపతికి తరలించాల్సి ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో తిరుమలలోని జనసంచారంలో తరుచూ శునకాలు కనిపిస్తునే ఉన్నాయి. తాజాగా, మంగళవారం రాత్రి జరిగిన గరుడవాహనసేవ జరుగుతున్న సమయంలోనూ శునకం కనిపించింది. ఆలయం ముందు వాహనసేవ ముందుకు కదులుతున్న క్రమంలో అతిదగ్గరగా శునకం రావడం గమనార్హం. శునకాన్ని గుర్తించిన అధికారులు, సిబ్బంది శునకం ఎలా వచ్చిందంటూ కంగారుపడిపోయారు. వాహనసేవ నుంచి దూరంగా తరిమారు. సిబ్బంది నిర్లక్ష్యంపై అధికారులు ఆగ్రహించినట్లు సమాచారం.

పులిచెర్ల వద్ద ఎర్రచందనం స్వాధీనం

మంగళం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు-పీలేరు రహదారిలో మంగళవారంఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించి 13 ఎర్రచందనం దుంగలును స్వాధీనం చేసుకుని ఓ కారును సీజ్ చేశారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ డీఎఫ్‌వో రామకొండారెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు మంగళవారంతెల్లవారుజాము నుంచి పూతలపట్టు-పీలేరు రహదారిలో పులిచెర్ల వద్ద అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉదయం 10.30గంటలకు పులిచెర్ల వద్ద ఏపీ 39 ఎల్‌జెడ్ 9951 నెంబరు గల కారు వేగంగారావడాన్ని అధికారులు గుర్తించారు. కారును ఆపే ప్రయత్నంచేయగా ఆపకుండా వెళ్లిపోయారు. దీంతో వాహనాన్ని వెంబడించారు.డ్రైవర్ గుడిపల్లి గ్రామం సమీపంలో కారునుఆపి పారిపోయాడు. అధికారులు కారునుపరిశీలించగా 13 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గమనించారు. దీంతో కారుతో సహ ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం 439.100 కేజీలు బరువు ఉందని వాహనంతో సమా ఎర్రచందనం విలువ రూ.18,64,857ఉంటుందని ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ సుబ్బరాయుడు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్‌వో శశికుమార్, ఎఫ్‌బీవోచంద్రబాబు, డ్రైవర్ సాయికిరణ్, ప్రొటెన్ వాచర్లు మునస్వామి, భార్గవ్, రాజా,చంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ఆస్పత్రికి కొత్త అంబులెన్స్

త్వరలో మరో వాహనం కూడా..: కలెక్టర్



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి ఐవోసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) సంస్థ సమకూర్చిన కొత్త అంబులెన్స్ వాహనాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద ఐవోసీఎల్ మరో అంబులెన్స్‌ను కూడా ఆస్పత్రికి అందివ్వనుందని చెప్పారు. దీంతో అంబులెన్స్‌ల సంఖ్య నాలుగుకు పెరుగుతుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్, డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్ఎస్ పద్మాంజలి, మెడికల్ సూపరింటెండెంట్ ఉష, ఐవోసీఎల్ ఈడీ పీయూష్ మిట్టల్, సీజీఎం సూరజ్ కుమార్ పట్నాయక్, జీఎం సతీష్ వెర్నేకర్, డీజీఎం కైలాస్‌కాంత్, చిత్తూరు ఐవోసీఎల్ ఇన్‌చార్జి రామారావు, టెర్మినల్ ఇన్‌చార్జి అరుణ్‌ప్రసాద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం జిల్లా జైలు అడిషనల్ సూపరింటెండెంట్‌గా వేణుగోపాల్‌రెడ్డి



చిత్తూరు సిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ డి.వేణుగోపాల్‌రెడ్డికి అనంతపురం జిల్లా జైలు అడిషనల్ సూపరింటెండెంట్ పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా జైలు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

జోరుగా డీపీఆర్‌సీ భవన నిర్మాణ పనులు



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈ ఆనందరెడ్డి

గంగాధరనెల్లూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరులో జిల్లా పంచాయతీరాజ్ ట్రైనింగ్ సెంటర్ (డీపీఆర్‌సీ) పక్కా భవన నిర్మాణం పనులు జోరుగా జరుగుతున్నాయి. పనులను జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ నవీన్ ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరు డీఈ ఆనందరెడ్డి పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం మోల్డింగ్ పనులను డీఈ పరిశీలించారు.

ఎస్‌డబ్ల్యూపీసీలను సద్వినియోగం చేసుకోవాలి

డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ హరిప్రసాద్‌రెడ్డి

గంగాధరనెల్లూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఉండే ఎస్‌డబ్ల్యూపీసీలను సద్వినియోగం చేసుకోవాలి పంచాయతీ కార్యదర్శులను డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ హరిప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. గంగాధరనెల్లూరు ఎంపీడీవో ఆఫీస్‌లో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఇళ్ల వద్ద మురుగు నిల్వ ఉండకుండా, తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని చెప్పారు. ఎంపీడీవో మనోహర్ గౌడ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



వెంకటేష్ మృతదేహం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చిత్తూరు సంతపేటలో జరిగింది. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని తోటపాళ్యంకు చెందిన వెంకటేష్‌కు ఇద్దరు భార్యలు. ఓ భార్య తోటపాళ్యంలో ఉండగా, రెండో భార్య మునియమ్మ సంతపేటలో నివాసం ఉంటోంది. వెంకటేష్ మంగళవారం రెండోభార్య ఇంట్లో ఉన్నారు. మధ్యాహ్నం పాఠశాల నుంచి పిల్లల్ని తీసుకురావడానికి భార్య వెళ్లగా.. వెంకటేష్ చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇంటికి వచ్చిన భార్య ఫ్యాన్‌కు వేలాడుతున్న భర్తను చూసి.. చుట్టుపక్కలవారు, బంధువుల సాయంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దాంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

వ్యర్థాలతో పూడుతున్న డీకేపల్లె చెరువు



చెరువు కట్టను ఆనుకుని డంప్ చేసిన భవన నిర్మాణ వ్యర్థాలు

కుప్పం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని దళవాయికొత్తపల్లె చెరువు వ్యర్థాల డంపింగ్‌తో పూడిపోతోంది. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో విచ్చలవిడిగా ఇక్కడ వ్యర్థాల డంపింగ్ జరుగుతోంది. కుప్పం పట్టణంలో నిరంతరం భవన నిర్మాణ పనులు జరుగుతుంటాయి. పాత ఇళ్లను కూలగొట్టి కొత్త ఇళ్లను నిర్మించడం, గుట్టలు చదునుచేసి లే అవుట్లు వేయడం వంటివి జోరుగా సాగుతున్నాయి. ఇలా తొలగించిన గుట్టలు, ఇళ్ల వ్యర్థాలను యజమానులు దూరంగా తీసుకెళ్లి పడేయాల్సి ఉంటుంది. అయితే వారు సమీపంలోని డీకేపల్లె చెరువు కట్టమీదకు వచ్చి, కట్ట మొదట్లో ఆ వ్యర్థాలను తోసేసి వెళ్తున్నారు. క్వారీలనుంచి వచ్చే పనికిరాని భారీ బండలను సైతం ఇక్కడికే తీసుకువచ్చి పడేసి వెళ్తున్నారు. దీంతో వర్షాల కారణంగా ఒకపక్క చెరువు నీటితో నిండుతుంటే, మరోవైపు వ్యర్థాల డంపింగ్‌తో పూడిపోతోంది. మరోవైపు కట్ట చివర మన్ను తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. డీకేపల్లె పార్కునుంచి మొదలయ్యే కట్ట సుమారు అర కిలోమీటరు ముందుకు సాగుతుంది. ఈ చివరనుంచి గుడుపల్లె రోడ్డుకు మార్గముంది. ఈ మార్గంలో వస్తున్న అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా చెరువులోని మన్ను తవ్వి లేఅవుట్లు ఇతర అవసరాలకు తరలిస్తున్నట్లు చెబుతున్నారు. డీకేపల్లె చెరువులో వేసిన బోర్ల ద్వారా కుప్పం పట్టణానికి తాగునీటి సరఫరా జరుగుతుంది. ఈ వాహనాల రాకపోకలతో చెరువు కట్ట బలహీనమై గుంతలు పడుతోంది. ఇప్పటికైనా వ్యర్థాల డంపింగ్‌ను, మన్ను తవ్వకాలను ఆపి, డీకేపల్లె చెరువును పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



విచ్చలవిడిగా పడేసిన క్వారీ బండలు

నరక దారులు

- దుస్థితిలో పుంగనూరు - బెంగళూరు రోడ్డు
- అడుగడుగునా పెద్దపెద్ద గోతులతో ఇక్కట్లు
- నాలుగు కిలోమీటర్ల వరకు అవస్థల ప్రయాణం
- రూట్ మార్చిన బోయకొండ భక్తులు



పుంగనూరు-కర్ణాటక వెళ్లే రోడ్డులో అతి ప్రమాదకరంగా ఉన్న గుంతలు



కతార్లపల్లె క్రాస్ వద్ద గోతులమయంగా ఉన్న కర్ణాటక వెళ్లే రోడ్డు

పుంగనూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు-బెంగళూరు మార్గంలో కేవలం నాలుగు కిలోమీటర్ల వరకు పెద్దపెద్ద గోతులతో రోడ్డు దుస్థితికి చేరుకుంది. ఈ మార్గంలో ప్రయాణాలంటేనే జనం హడలిపోతున్నారు. కర్ణాటక నుంచి పుంగనూరు మీదుగా ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ, జిల్లాలోని ఇతర ప్రాంతాలకు వెళ్లే ఈమార్గంలో నిత్యం ద్విచక్రవాహనాలు, ఆటోలు, జీపులు, కార్లు, లారీలు తదితర వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. బెంగళూరు నుంచి వడ్డిపల్లె, యబ్బిణి తర్వాత రాష్ట్రంలోని పెద్దపంజాణి మండలం రాజుపల్లె క్రాసు నుంచి అరవపల్లె, సింగిరిగుంట మీదుగా పుంగనూరుకు వాహనాలు వస్తుంటాయి. వివిధ రకాల వస్తువులు, సరుకులతోపాటు ప్రయాణికులు కర్ణాటకకు ఈ మార్గంలోనే వెళ్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లె నుంచి రాయలపేట మీదుగా పుంగనూరు నియోజకవర్గం బార్డర్ వరకు సింగిల్ రోడ్డును డబుల్‌రోడ్డుగా విస్తరణ, కాజువే పనులు చేపట్టారు. అయితే పుంగనూరుకు చేరే ఒదుకు కేవలం 8 కిలోమీటర్ల రోడ్డును మాత్రం గాలికి వదిలేశారు. దీంతో కతార్లపల్లె క్రాస్, అరవపల్లె, కంపోస్ట్ యార్డు వద్ద, సింగిరిగుంట హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ వద్ద, శనేశ్వరస్వామి ఆలయం వద్ద, పుంగమ్మ చెరువు కట్టపై రోడ్డు అధ్వానంగా తయారై లోతుగా గోతులు పడటం, కొన్నిచోట్ల రోడ్డు చెరువులా తయారైంది. అరవపల్లె వద్ద సింగిల్‌రోడ్డుపై ఎదురుగా వచ్చే వాహనాలకు సైడు ఇవ్వాలన్నా పెద్ద పెద్దగోతులతో డ్రైవర్లు భయపడుతున్నారు. చిన్నకార్లు, వాహనాలు పలుమార్లు గోతుల్లో ఇరుకున్నాయి. గోతుల ప్రయాణాలతో అన్నివాహనాలు పాడై వాహనచోదకులు లబోదిబోమంటూ రిపేర్లు చేయించుకుంటున్నారు. ఈమార్గంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, రైతులు, ఆస్పత్రులకు వెళ్లే రోగులు, పలు శాఖల ఉద్యోగులు పుంగనూరు, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె, పలమనేరు, వి.కోట మండలాల్లో పనిచేసే ఉద్యోగులు, కర్ణాటక వెళ్లే ప్రయాణికులు, వ్యాపారులు అధికంగా వెళుతుంటారు. ఇటీవల ఉపాధ్యాయులంతా గోతుల వద్ద నిలబడి రోడ్డుపై గోతులు పూడ్చి తమ ప్రాణాలు కాపాడాలని నిరసన తెలిపారు. దుస్థితిలోని రోడ్డుతో పలుమార్లు రోడ్డుప్రమాదాలు జరిగాయి. కర్ణాటక నుంచి వచ్చేవారు కేవలం నాలుగు కిలోమీటర్ల గోతుల రోడ్డులో వెళ్లలేక వడ్డిపల్లె నుంచి పలమనేరు మీదుగా బోయకొండ, పుంగనూరుకు వెళుతున్నారు. మరికొందరు చింతామణి నుంచి రామసముద్రం మీదుగా పుంగనూరు వస్తున్నారు. విధిలేక కొన్ని ప్రైవేటు, ఆర్టీసీ బస్సులు నడుస్తున్నా పలు రిపేర్లు వస్తున్నాయని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని నాలుగు కిలోమీటర్ల వరకు రోడ్డు విస్తరణ పనులు, డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అరవపల్లె వద్ద పుంగనూరు నుంచి కర్ణాటక వెళ్లే సింగిల్ రోడ్డు



నారావారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన పులిచెర్ల మండలం టీడీపీ నాయకుడు వి.మురళీధర్ నాయుడు


వ్యాపార రంగంలో మహిళా సాధికారత



వ్యాపారవేత్తల మేళాలో మాట్లాడుతున్న మహిళ

కుప్పం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యాపార రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఆ రంగాన్ని ఎంచుకున్న మహిళలకు సాధికారత దక్కుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కడా ఆధ్వర్యంలో మంగళవారం గ్రామీణ మహిళా వ్యాపారవేత్తల మేళా జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం గ్రామీణ మహిళలకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. వ్యాపార రంగాన్ని ఎంచుకుని స్వావలంబన దిశగా సాగాలని సూచించారు. అనంతరం పలువురు గ్రామీణ మహిళా వ్యాపారవేత్తలు మాట్లాడుతూ తమ రంగంలో ప్రభుత్వం నుంచి అందుతున్న సాయాన్ని గురించి వివరించారు. వ్యాపార రుణాలకోసం పలువురు మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, బీజేపీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జీలు ఎన్ఎస్.తులసీనాథ్, నరేశ్ పాల్గొన్నారు.

చలో విజయవాడ ధర్నాలో కుప్పం ఉపాధ్యాయ నేతలు



విజయవాడలో జరిగిన ధర్నాలో పాల్గొన్న చిట్టిబాబు

కుప్పం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ధర్నా చౌక్‌లో మంగళవారం ఉపాధ్యాయ సమస్యలపై ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో కుప్పం నియోజకవర్గానికి చెందిన ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పోతుగుంట చిట్టిబాబు పాల్గొన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ నాయకులతో కలిసి ఆయన ఉపాధ్యాయ సమస్యల కోసం ఉద్యమించారు. చిత్తూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

గంగవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని పలమనేరు ఇన్‌చార్జి ఎంపీడీవో వినోద, ఎంఈవో లీలారాణి సూచించారు. మంగళవారం పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన

సదుం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అమలుతో విద్యార్థులు వాడుకునే స్టేషనరీ వస్తువుల ధరల తగ్గుదలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో జీఎస్టీ తగ్గిన శాతంపై ప్లకార్డులతో ప్రదర్శనలు చేశారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పాలమంద, బూరగమంద, చెరుకువారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలల్లోనూ ఆయా గ్రామ కార్యదర్శుల ద్వారా జీఎస్టీ తగ్గుదలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధారాణి, ఎంఈవోలు నటరాజన్, దామోదర్, వసతి గృహ, మండల పరిషత్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



కుప్పం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని సామగుట్టపల్లె సమీపంలో కుప్పం-పలమనేరు జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కుప్పం మండలం నూలకుంట గ్రామానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని, బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

గరుడ వాహనంపై శ్రీవారి కటాక్షం



గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

పుంగనూరు రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా శ్రీవారు గరుడ వాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగారు. మంగళవారం రాత్రి స్థానిక కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి ఉత్సవ విగ్రహాన్ని టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించి పట్టణంలో హైస్కూల్‌వీధి, కట్టకిందపాళ్యం, బ్రహ్మణవీధి మీదుగా ఊరేగించారు. భక్తులకు స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, అర్చకులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుంగనూరు రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో జరిగిన స్కూల్‌గేమ్స్‌లో ప్రతిభ కనబరిచి డివిజన్ స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. సోమవారం పుంగనూరు మండలం పూజగానిపల్లె జడ్పీ హైస్కూల్ ఆవరణలో జరిగిన మండల స్థాయి స్కూల్‌గేమ్స్‌లో పరుగుపందెం, లాంగ్‌జంప్, హైజంప్ తదితర క్రీడాపోటీల్లో పూజగానిపల్లె, గూడూరుపల్లె, చంద్రమాకులపల్లె హైస్కూల్ విద్యార్థులు బాలుర విభాగంలో దేవేంద్ర, లక్ష్మీలోచన్, జలీల్, లతీఫ్‌లు, బాలికల విభాగంలో జ్యోత్స్న , గానవి, కన్నమ్మ, పూజ, కళావతి ప్రతిభ కనబరిచి సదుం మండలంలో జరిగే డివిజన్ స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు కోఆర్డినేటర్ జయకృష్ణ తెలిపారు.

పొలాల్లో రైతుల జాగరణ

సోమల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని పట్రపల్లె, కొత్తూరు సమీప పొలాల్లో ఏనుగులు సంచరించడంతో రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. పొలాల్లోని వరిపైర్లను ఏనుగులు ధ్వంసం చేయడంతో వాటిని కాపాడుకోవడానికి రైతులు జట్లుగా ఏర్పడి పొలాల వద్ద మంటలు, డప్పుల శబ్దాలు చేయడం చేస్తున్నారు. సోమవారం రాత్రి కోనమూలలో సంచరించాయని రైతులు తెలిపారు. మూడు రోజుల క్రితం ఐరాల మండలం వైపు వెళ్లిన ఏనుగులు పట్రపల్లె వైపు రావడంతో ఆందోళ వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు ఆశయాలు నెరవేర్చేందుకు కృషి

సోమల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు ఆశయాలు సాధించేందుకు ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. మంగళవారం సూరయ్యగారిపల్లె వద్ద జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి వారిని పార్టీ వైపు ఆకర్షించాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్, మాజీ సర్పంచ్ మునిచంద్ర, వేణుగోపాల్ నాయుడు, సతీశ్, బాలకృష్ణ, విశ్వనాథం, మల్లికార్జున, మహేంద్రబాబు, మోహన్‌నాయుడు, రెడ్డిశేఖర్, శంకర్, మునిచంద్ర పాల్గొన్నారు.

నారావారిపల్లెకు తరలిన టీడీపీ నాయకులు

సోమల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామూర్తి నాయుడు సంవత్సరీకం కార్యక్రమం నారావారిపల్లెలో మంగళవారం నిర్వహించడంతో సోమల మండలం నుంచి పలువురు టీడీపీ నాయకులు తరలివెళ్లారు. సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, నీటి సంఘ అధ్యక్షుడు గల్లా బోస్, మాజీ నీటి సంఘ అధ్యక్షుడు కోటీశ్వరరావు, సతీశ్, శ్రీనివాసులు మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు.

ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ



చౌడేపల్లె, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఎ.కొత్తకోటలోని సచివాలయం వద్ద మంగళవారం టీడీపీ నాయకులు మునిరాజు ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఏకొత్తకోట గ్రామస్తులు, వాల్మీకి నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే చౌడేపల్లెలో వాల్మీకి సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాన్ని ఊరేగించారు.

వాల్మీకులకు ఎస్టీ హోదా పునరుద్ధరించాలి



కుప్పంలో వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు



పుంగనూరులో వాల్మీకి మహర్షి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వాల్మీకి సంఘం, టీడీపీ నాయకులు

కుప్పం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం వాల్మీకులకు ఎస్టీ హోదా పునరుద్ధరించాలని వాల్మీకి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. కుప్పం నియోజకవర్గ వాల్మీకి భవన్‌లో మంగళవారం వాల్మీకి జయంతి వాల్మీకి సామాజిక వర్గం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం మాట్లాడుతూ వాల్మీకుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఏపీ ఐఐసీ డైరెక్టర్, కుప్పం నియోజకవర్గ వాల్మీకి సంఘం వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, నియోజకవర్గ వాల్మీకి నాయకులు కేశవదాసు భాగవతార్, మల్లానూరు ప్రేమ్‌కుమార్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బాబు నాయుడు, బేటప్పనాయుడు, మునిరత్నం, మురళి, సూరి, కంగుంది బాబు, జయరాం నాయుడు, కౌన్సిలర్లు జిమ్ దాము, సురేశ్, గోవిందస్వామి, పలువురు వాల్మీకులు పాల్గొన్నారు.

● **పుంగనూరు:** స్థానిక ఇందిరాసర్కిల్‌లో విశ్రాంత డీఎస్పీ సుకుమార్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలికోన్నత పాఠశాల, బసవరాజ ప్రభుత్వ కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు వాల్మీకి సంఘ నాయకుడు సుకుమార్‌బాబు క్రీడా వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో పుంగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ శమిపతి, సీఐ సుబ్బరాయుడు, వాల్మీకి సంఘనాయకులు డాక్టర్ పి.శివ, రెడ్డెప్ప, అద్దాల నాగరాజు, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, పోలీసుగిరి, కోలాట వెంకటరమణ, గంగాధర్, సులోచన, మాలమహానాడు రాష్ట్ర నాయకుడు అశోక్‌కుమార్, బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, డిష్ రాజారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటపతి, భరత్‌భూషణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

● **సోమల:** సోమల బస్టాండ్‌లో వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్, నక్కా నరసింహులు, మేకల గంగాధరం, రామకృష్ణ, శివయ్య, ప్రభు, బత్తల రమేశ్, మణి, వెంకట్రమణ, మణి యాదవ్, మహేంద్రబాబు, మల్లికార్జున, చాణుక్య తదితరులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** రామకుప్పం మండలంలో వాల్మీకి కులస్థులు మంగళవారం వాల్మీకి జయంతి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటాలను ఆవిష్కరించి నివాళులర్పించారు. రామకుప్పంలో మూడు ట్రాక్టర్లలో వాల్మీకి చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ నృత్యం చేస్తూ యువతలో ఉషారును నింపారు.

● **సదుం:** స్థానిక వాల్మీకి సఘం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాత్రి ప్రత్యేక వాహనంపై వాల్మీకి మహర్షి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు.



రామకుప్పంలో నృత్యం చేస్తున్న కంచర్ల శ్రీకాంత్

పోలీసుల రక్షణ కోరిన ప్రేమజంట



రొంపిచెర్ల పోలీస్‌స్టేషన్‌లో పెళ్లి చేసుకున్న ప్రేమికులు

రొంపిచెర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంట తమకు రక్షణ కావాలని మంగళవారం రొంపిచెర్ల పోలీసులను ఆశ్రయించారు. రొంపిచెర్ల మండలం మోటుమల్లెల పంచాయతీ పెండ్లికనుమకు చెందిన రంజిత్ (21), ఇందు (20) రెండేళ్లుగా ప్రేమించుకున్నారు. తిరుపతి జిల్లా పాకాల సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో ఇరువురు సోమవారం వివాహం చేసుకున్నారు. అనంతరం రొంపిచెర్ల పోలీ స్టేషన్‌కు చేరుకుని రక్షణ కోరారు. ఇరువురు మేజర్లు కావడంతో గ్రామ ప్రజలు ప్రేమికుల పెద్దలకు నచ్చచెప్పారు. పెళ్లిని పెద్దలు అంగీకరించారని ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

వైభవంగా మునీశ్వరస్వామి దేవర



పూజల్లో పాల్గొన్న పీఎంతండా, పీఎంకేతండా వాసులు

రామకుప్పం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పీఎంతండా, పీఎంకేతండాల వాసులు మంగళవారం మునీశ్వరస్వామి దేవరను వైభవంగా జరుపుకున్నారు. రెండు గ్రామాల మధ్య గల 500 ఏళ్ల వయస్సు ఉన్న మర్రివృక్షం కింద ఉన్న మునీశ్వరస్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి అలంకరణలు చేశారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, నేతలు మునిరాజనాయక్, ఆదెప్పనాయక్, ధనపాల్‌నాయక్, భూపతినాయక్, దేవలానాయక్, గోపాల్‌నాయక్, మురళీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల సంక్షేమమే చంద్రబాబు తపన

● మణీంద్రం గ్రామసభలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



గ్రామసభలో మాట్లాడుతున్న కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల బాగు కోసమే సీఎం చంద్రబాబు పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నారని కడ పీడీ వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం రామకుప్పం మండలం మణీంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన కోసం పలు చోట్ల పరిశ్రమలు ఏర్పాటవుతున్నారు. అందులో భాగంగానే మణీంద్రం గ్రామ పరిసరాల్లో 600 ఎకరాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 600 ఎకరాల్లో పరిశ్రమలు ఏర్పాటయితే సుమారు 20 వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో 75 శాతం స్థానికులకే అవకాశం కల్పించేందుకు పలు కంపెనీలు అంగీకరించాయన్నారు. అర్హతను బట్టి స్థానికులకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై తగు శిక్షణ ఇప్పిస్తామన్నారు. భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు రూ.16 లక్షలు నష్టపరిహారం అందిస్తామని, ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమం పథకంతో వారిని ఆదుకుని ఆర్థిక ఎదుగుదలకు దన్నుగా ఉంటామని తెలిపారు. రైతులు భూములిచ్చేందుకు అంగీకరిస్తే ఆరునెలల్లో పరిశ్రమలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్డీవో శ్రీనివాసులురాజు, తహసీల్దారు కౌలేష్, ఏపీఎస్ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, టీడీడీ బోర్డు సభ్యులు శాంతారాం, రెస్కో చైర్మన్, వైస్‌చైర్మన్లు ప్రతాప్, విశ్వనాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, నేతలు రామ్మూర్తి, గుర్రప్ప, కామరాజనాయక్, రామలింగారెడ్డి, మంజునాథరెడ్డి, జేయి, నవీన్, మణీంద్రంనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సంతపేట రోడ్డు విస్తరణలో భాగంగా 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ లైన్ల మార్పు, మరమ్మతుల కారణంగా నగరంలో బుధ, గురువారాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. ఈమేరకు సంతపేట ఏఈ చిరంజీవి తెలిపారు. బజారువీధి, జెండా మానువీధి, ఓటీకేరోడ్డు, గాంధీరోడ్డు, ఇందిరానగర్, శేషాపురం, డీఐ రోడ్డు, తోటపాళ్యం, కైలాసపురం, ఎల్‌ఐసీ కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వివరించారు.



ప్రతి పంటకూ ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి

చిత్తూరు రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి పంటకూ ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ సూచించారు. మంగళవారం చిత్తూరు రూరల్ మండలంలోని చెర్లోపల్లె, తిమ్మసముద్రం గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ-క్రాప్ బుకింగ్ ఈనెల 25వ తేదీతో గడువు ముగుస్తుందని చెప్పారు. ఏవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ నడుపుతూ.. జీఎస్టీపై థామస్ అవగాహన

వెదురుకుప్పం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో మంగళవారం సాయంత్రం ట్రాక్టరును రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ నడుపుతూ సూపర్ జీఎస్టీ 2.0పై అవగాహన కల్పించారు. సబ్సిడీతో కొనుగోలు చేసిన వ్యవసాయ ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభించారు. ఎంపీడీవో చంద్రమౌళి, ఏపీఎం కవిత, సీఐ హనుమంతప్ప, ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యుగంధర్, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు నగలపాటి నాగేశ్వరరాజు, కార్వేటినగరం టీడీపీ అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ఏఎంసీ చైర్మన్లు కృష్ణమనాయుడు, జనార్ధన్‌రాజు, మోహన్‌నాయుడు, యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, మాజీ ఎంపీపీ ఇందిర, క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, నాయకులు వి.రాజ, హరీష్ యాదవ్, సాతల గుణశేఖర్, తోటి మురళీమోహన్, మేళం రవికుమార్‌యాదవ్, మేళం వెంకటకృష్ణ యాదవ్, సంధాని, చంద్రగిరి చెంగల్రాయులు, వాసుదేవరెడ్డి, కార్జాల అరుణ, బీఎం రవి, సోమశేఖర్, రవిరాజు పాల్గొన్నారు.


కార్వేటినగరంలో ట్రాక్టరు నడుపుతూ టీడీపీ నాయకులను, కార్యకర్తలను ఉత్సాహపరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం


నగరిలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆటోడ్రైవర్లు

నగరి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తమకు ఏడాదికి రూ.15వేల ఇవ్వడంపై థాంక్యూ సీఎం గారు అంటూ చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ నాయకులతో కలసి ఆటోడ్రైవర్లు.. పాలాభిషేకం చేశారు. మంగళవారం నగరి టవర్‌క్లాక్ సమీపంలోని ఆటోస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, సీపీఐ కార్యదర్శి గుణశేఖర్, కృష్ణారెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి, జ్యోతి నాయుడు, కన్నయ్య, సలీం, శ్రీధర్, శ్రీనివాసులు, శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె: మండలంలోని అరగొండలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ఆటో డ్రైవర్లు మంగళవారం పాలాభిషేం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, నాయకులు గాలి దిలీప్, రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అరగొండలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆటోడ్రైవర్లు

చంద్రబాబును కలిసిన అమర్నాథ నాయుడు



యాదమరి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తన సోదరుడు రామ్మూర్తి నాయుడు సంవత్సరీకం సందర్భంగా తమ స్వగ్రామం నారావారిపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా సీఎంను చిత్తూరు పార్లమెంటు తెలుగుయువత అధికార ప్రతినిధి వల్లేరు అమర్నాథ నాయుడు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

కాణిపాకానికి వచ్చే అయ్యప్ప భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడండి

- అధికారులకు వరసిద్ధుడి ఆలయ ఈవో సూచన

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాణిపాకానికి వచ్చే అయ్యప్ప భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచలకిషోర్ ఆదేశించారు. మంగళవారం ఈఈ వెంకటనారాయణతో కలసి ఆలయ పరిసరాల్లోని బస్టాండ్, టాయిలెట్స్, స్నానపు ఘట్టాలను పరిశీలించారు. అందరికీ స్వామి దర్శనమయ్యేలా క్యూలైన్ల ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి దుర్మరణం

బంగారుపాళ్యం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. సంక్రాంతిపల్లె పంచాయతీ బేరిపల్లెకు చెందిన మణి (51) సోమవారం గ్రామంలో వినాయకుని గుడి నిర్మాణం జరుగుతుండగా ఓ ప్లగ్ బాక్స్ కిందపడి ఉండటంతో దాన్ని ఎత్తిపెట్టే క్రమంలో ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



యువతి అదృశ్యం


ఉష

పెనుమూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వెంకట నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. సాతంబాకం పరిధిలోని బలిజపల్లెకు చెందిన డి.ఉష (21) ఈనెల ఐదో తేదీనుంచి కనిపించడం లేదని తల్లిదండ్రులు గోపి, సౌజన్యలు మంగళవారం ఫిర్యాదు చేశారు. గంగాధరనెల్లూరు మండలం వెంకటాపురానికి చెందిన దేవరాజులు కుమారుడు మధుకర్‌పై తమకు అనుమానం ఉందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

బంగారుపాళ్యం,అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదైంది. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. మొగిలికి చెందిన రవికుమార్ తన ఇంటి ముందు పార్కు చేసిన బుల్లెట్ వాహనాన్ని సోమవారం రాత్రి ఎత్తుకెళ్లినట్లు మంగళవారం ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 94407 96736, 94906 17890 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

వేడుకగా వాల్మీకి మహర్షి జయంతి

చిత్తూరు సిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్‌పీ సావిత్రమ్మ మహిళా కళాశాలలో వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం వేడుకగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉషారాణి, హిందీ అధ్యాపకురాలు షమ్స్ అక్తర్ ప్రసంగించారు. క్లిష్ట పరిస్థితుల్లో ఎలా మెలగాలో వాల్మీకి రామాయణం తెలియజేస్తుందన్నారు. ఇండోనేషియా,మలేషియా,వియత్నాం, వంటి దేశాల్లో సైతం ఈ గ్రంథం ఆదరణ పొందిందన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు.

వైభవంగా పున్నమి గరుడ సేవ



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో వెలసిన వరదరాజస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తులతో అర్చకులు నిర్వహింపజేశారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజ స్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు పాల్గొన్నారు.


రాజరాజేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ఠకు రూ.50వేల విరాళం



గుడిపాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చిత్తపార గ్రామంలో నిర్మించిన రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు మంగళవారం జీజేఎం ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవుల నాయుడు రూ.50వేలను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందగౌడ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నగర నాయీ బ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గం



చిత్తూరు అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నగర అధ్యక్షుడిగా ప్రసాద్, ఉపాధ్యక్షులుగా మురళి, లక్ష్మీకాంత్, సెక్రటరీలుగా ధనశేఖర్, శివ, మేఘనాథం, కోశాధికారిగా వాసు కిరణ్, మురళీ కృష్ణ, సంయుక్త కార్యదర్శిగా కార్తీక్, ప్రచార కార్యదర్శులుగా పెరుమాళ్, దిలీప్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జ్ఞానశేఖర్‌తోపాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

మినీ గోకులం షెడ్లు పాడి రైతులకు వరం


పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ ఆసీఫ్

బంగారుపాళ్యం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మినీ గోకులం షెడ్లు పాడిరైతులకు వరమని టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, బంగారుపాళ్యం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఆసీఫ్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పశుసంవర్ధకశాఖ, డ్వామా సంయుక్తంగా పాడిరైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు ప్రసంగించారు. ఉపాధి పథకం కింద మండలంలో తొలి విడతలో 125 గోకులం షెడ్ల నిర్మాణాలు చేపట్టగా, రెండో విడతలో 168 షెడ్లు మంజూరయ్యాయని చెప్పారు. టీడీపీ నాయకులు జనార్ధన్‌గౌడ్, లోకనాథనాయుడు, కమలనాథరెడ్డి, రమేష్, చంద్రయ్యనాయుడు, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నేతాజీనాయుడు, జనసేన నాయకుడు కిషోర్, ఇన్‌చార్జి ఎంపీడీవో పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.